సాక్షి
కామారెడ్డి

శుక్రవారం। 29। సెప్టెంబర్। 2023



భూమి పూజ

బాన్సువాడలో రూ. 40 లక్షలతో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేశారు.

- 9లో ▸



ఆందోళన చేస్తాం

దోమకొండలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /22.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నాలుగు రోజుల పాటు రైల్వే గేటు మూసివేత

కామారెడ్డి టౌన్: సదాశివనగర్ మండలం ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్ పరిధిలోని రంగంపేట వద్ద ఉన్న క్రాసింగ్ రైల్వే గేట్ నంబర్ 207ను నాలుగు రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ విషయాన్ని రైల్వే నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీరింగ్ అధికారి నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే మరమ్మతులలో భాగంగా ఈనెల 29, 30, వచ్చేనెల 1, 2 తేదీలలో గేటు మూసి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు రైల్వే శాఖకు సహకరించాలని కోరారు. ఈ రైల్వే గేటు పక్కన అండర్ పాస్ ఉందని, ఆ దారిలో వెళ్లాలని సూచించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

కామారెడ్డి టౌన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో 25 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రకటించారు. ఈ విషయాన్ని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె విరమిస్తే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

'రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి క్రైం: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. లూయీ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రేబిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కుక్క, పిల్లి, ఎలుకలాంటి జంతువులు కరవడం ద్వారా ఇతర జంతువులతోపాటు మనుషులకు రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పెంపుడు కుక్కే కదా అని నిర్లక్ష్యం చేయరాదని, ముందు జాగ్రత్తగా పెంపుడు జంతువులకు రేబిస్ టీకా వేయించాలని సూచించారు. కరిచింది పెంపుడు కుక్క అయినా వెంటనే వైద్యులను సంప్రదించి యాంటీ రేబిస్ టీకా తీసుకోవాలని సూచించారు.

ఘనంగా అనంత చతుర్దశి



భిక్కనూరు: మండలం కేంద్రంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం అనంత చతుర్దశి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోనే ఏకైక అనంత పద్మనాభ స్వామి ఆలయం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంత కోటి వ్రతాలు నిర్వహించిన అనంతరం అనంత కోటి వత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలోని చండి మంత్రాలయంలో అక్టోబర్ 15 నుంచి 22 వరకు 43వ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రియానంద పరివారం ఓ ప్రకటనలో తెలిపింది. 15న ఉదయం 8 గంటలకు నవరాత్రి పూజ సంకల్పం, దీక్ష స్వీకరణ ఉంటాయని, ఆసక్తిగల వారు పాల్గొనాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల్లో రోజూ ప్రత్యేక పూజలు, సత్సంగం, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటాయని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సింధే



నిజాంసాగర్(జుక్కల్): ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును గురువారం హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే కలిశారు. బిచ్కుంద మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసినందుకు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



కామారెడ్డిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

బై బై గణేశా

- కనుల పండువగా సాగిన శోభాయాత్ర
- జిల్లాలో ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం





కామారెడ్డి టౌన్: నవరాత్రులు పూజలందుకున్న వినాయకుడు గురువారం గంగమ్మ చెంతకు చేరాడు. జిల్లా వ్యాప్తంగా వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర గురువారం రాత్రి వరకు కొనసాగింది. ధర్మశాల వద్ద ప్రారంభమైన శోభాయాత్రకు ఇందిరాచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మండపాల నిర్వాహకులను వీహెచ్‌పీ ప్రతినిధులు సన్మానించారు. అక్కడి నుంచి స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, మాయాబజార్, జేపీఎన్ విగ్రహం, పాంచ్‌రస్తా, గోపాలస్వామిరోడ్, పెద్దబజార్, రైల్వేబ్రిడ్జి, నిజాంసాగర్ చౌరస్తా, కొత్తబస్టాండ్ మీదుగా టేక్రియాల్ వరకు శోభాయాత్ర కొనసాగింది. టేక్రియాల్ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షంలోనూ శోభాయాత్ర కొనసాగింది. 400లకు పైగా విగ్రహాలను టేక్రియాల్ చెరువులో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న గణనాథులు..

పలు మండపాలలో భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. 20 ఫీట్లకుపైగా ఎత్తున్న విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో ప్రతిష్ఠించారు. శోభాయాత్రను వీక్షించడానికి చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. దీంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

భారీ బందోబస్తు

శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐ, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుల్స్, ఎన్‌సీసీ కేడెట్లు బందోబస్తులో పాల్గొన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. టేక్రియాల్ చెరువు వద్ద నిమజ్జనం కోసం భారీ క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. వాటి సాయంతో విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోకి వాహనాలకు రాకుండా పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు.



కామారెడ్డిలో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు



బాన్సువాడలో నృత్యం చేస్తున్న భక్తులు



నిజాంసాగర్‌లో కోలాటం ఆడుతున్న భక్తులు



కామారెడ్డిలో నిమజ్జనోత్సవ శోభాయాత్ర



గణనాథుల వద్ద భక్తుల సందడి

ఆటబొమ్మల్లో బతుకువేట!

- పండుగలు, జాతరల్లో దుకాణాల ఏర్పాటు
- ఎక్కడెక్కడి నుంచో వచ్చి అమ్మకాలు



కామారెడ్డి రైల్వేస్టేషన్ రోడ్‌లో వెలసిన ఆటవస్తువుల దుకాణాలు



వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సాక్షి, కామారెడ్డి: పండుగలు, పబ్బాలంటే పిల్లలకు ఎంతో ఇష్టం. జాతరలంటే ఎగిరి గంతేస్తారు. జాతరలలో వెలసిన దుకాణాలలో వాళ్లకు కావలసిన ఆట వస్తువులు కొనుక్కోవచ్చునన్నది వాళ్ల ఉద్దేశం .. బెలూన్లు, పిల్లనగ్రోవిలు, పీపెలు, బొమ్మలు.. ఇలా రకరకాల ఆటవస్తువులు జాతరలలో ఆకర్షిస్తాయి. పిల్లలు వాటి వద్దకు పరుగులు తీస్తారు. పిల్లలు కావాలని అడిగితే కాదనలేక తల్లిదండ్రులు కొన్నైనా కొనిస్తారు. అయితే పండుగలు, జాతరలు సరదా కోసమే కాదు.. ఎందరికో బతుకు బాట చూపుతున్నాయి. ఎంతోమందికి బతుకుదెరువు దొరుకుతోంది. జాతరలు అనగానే ఎక్కడెక్కడి నుంచో బొమ్మలు తీసుకుని వచ్చి విక్రయించి జీవనం సాగిస్తుంటారు. ప్రధానంగా బీహార్, యూపీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వందలాది కుటుంబాలు జాతరలు జరిగే పట్టణాలు, ఊళ్లకు వచ్చి ఆట వస్తువులు అమ్ముతూ నాలుగు డబ్బులు సంపాదించుకుని తిరిగి సొంతూళ్లకు వెళుతుంటారు. రాష్ట్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు పెట్టింది పేరైన కామారెడ్డి పట్టణానికి వందలాది మంది వచ్చి పది రోజుల పాటు వ్యాపారం చేసుకుని వెళతారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని సిరిసిల్ల రోడ్డు మొత్తం జాతరను తలపిస్తుంది. సాయంత్రం అయ్యిందంటే చాలు.. వేలాది మంది జనం రోడ్లపైకి వస్తారు. వినాయక మండపాలకు వెళ్లిన తర్వాత తమకు అవసరమైన వస్తువులు, పిల్లలకు ఆట వస్తువులు కొనుగోలు చేస్తుంటారు.

బొమ్మలతోనే బతుకుదెరువు..

వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పండుగల సమయంలో హైదరాబాద్‌కు చేరుకుంటారు. బేగం బజార్‌లో హోల్‌సెల్ దుకాణాల్లో ఆట వస్తువులు, బొమ్మలు, పీకలు తదితర వస్తువులు కొనుగోలు చేసి పండుగలు, జాతరలు జరిగే ప్రాంతానికి మూడు నాలుగు రోజుల ముందే చేరుకుంటారు. జాతర అయిపోయిన మూడు నాలుగు రోజుల తర్వాత మరో ప్రాంతానికి వెళ్లిపోతారు. కొందరు వినాయక చవితి ఉత్సవాలు ముగిసినా ఇక్కడే ఉంటారు. దేవి నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యాక సొంతూళ్లకు పయనమవుతారు. కొందరు లాడ్జీలు అద్దెకు తీసుకుని ఉంటుండగా.. ఇంకొందరు డేరాలు వేసుకుంటారు. పిల్లల ఆట వస్తువులే కాదు మహిళలకు అవసరమైన అలంకరణ వస్తువులు, పింగాణి పాత్రలు, గ్లాసులు.. అలాగే ఇంటికి అందాన్నిచ్చే షోకేసులు కూడా అమ్ముతుంటారు.

కష్టానికి తగిన ఫలితం..

ఒక్కో కుటుంబం బెలూన్లు, ఆట వస్తువులు, ఆడవాళ్ల అలంకరణ వస్తువులు, వంటింటి పాత్రలు తదితర వస్తువులు అమ్ముకుని పండుగ సీజన్‌లో కనీసం రూ.50 వేలు సంపాదిస్తుంటారు. పగలు, రాత్రి పని చేస్తామని, కష్టపడితేనే నాలుగు డబ్బులు వస్తున్నాయని బెలూన్లు విక్రయించే బీహార్‌కు చెందిన సమద్ 'సాక్షి'తో పేర్కొన్నాడు.

పండుగ అయిపోగానే వెళ్లిపోతాం



గణేశ్ పండుగ కోసం ఇక్కడికి వచ్చాం. ఆట వస్తువులు విక్రయిస్తున్నాం. రోజూ సాయంత్రం ఎక్కువ గిరాకీ ఉంటుంది. సంపాదన పరవాలేదు. ఖర్చులన్నీ పోనూ రోజుకు మూడు నుంచి నాలుగు వేలు సంపాదన ఉంటుంది. ప్రతి సీజన్‌లో వస్తాం. నవరాత్రులు అయిపోగానే వెళ్లిపోతాం.

– సంజయ్, బీహార్

వాగు ప్రవాహంలో పశువులు గల్లంతు



భీమేశ్వర వాగులో కొట్టుకుపోతున్న గేదెలు



వాగవతల ఉన్న పశువులు

- కొట్టుకుపోయిన వందకుపైన ఆవులు, గేదెలు

తాడ్వాయి: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్ శివారులో గల భీమేశ్వర వాగులో సుమారు వంద పశువులు కొట్టుకుపోయాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పశువుల కాపరులు రోజులాగే గురువారం ఉదయం గ్రామంలోని రైతులకు సంబంధించిన 170 ఆవులు, బర్రెలను గ్రామ శివారులోని భీమేశ్వర వాగు అవతల ప్రాంతానికి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం మండలంలోని పలు ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. సంతాయిపేట్‌లో ఓ మోస్తరు వానే కురిసింది. సాయంత్రం పశువుల కాపరులు పశువులను తోలుకుని గ్రామానికి వస్తుండగా.. వాగు మధ్యలో ప్రవాహ వేగం పెరిగింది. పశువుల కాపరులు తప్పించుకున్నారు. వాగు మధ్యలో ఉన్న పశువులు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. వందకుపైనే పశువులు కొట్టుకుపోయాయని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో పశువుల ఆచూకీ తెలియడం లేదు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సంతాయిపేట్ గ్రామస్తులకు ఫోన్ చేసి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ముస్లింలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

కామారెడ్డి క్రైం: ముస్లిం మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచించారు. కామారెడ్డిలోని సత్య గార్డెన్‌లో గురువారం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో 600 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ ముస్లింలు చదువులోనూ రాణించాలన్న ఉద్దేశంతో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. పేద మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ప్రభుత్వం రూ. 20 లక్షల సాయం అందిస్తోందన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాల అభివృద్ధికోసం రూ.1.10 కోట్లు వెచ్చించామన్నారు. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, మైనారిటీ కార్పొరేషన్, ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో దంచికొట్టిన వాన

సాక్షి, కామారెడ్డి: జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వాన దంచికొట్టడంతో కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వినాయక నిమజ్జన శోభాయాత్ర కొనసాగుతున్న సమయంలో వర్షం పడడంతో యాత్రకు కొంత అంతరాయం కలిగింది. భారీ వర్షంతో రోడ్ల మీద నీరు నిలిచిపోయింది. వర్షం తగ్గిన తర్వాత శోభాయాత్ర తిరిగి ప్రారంభమైంది.

తాడ్వాయి: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. తాడ్వాయి మండలంలోని భీమేశ్వరం, ఎర్రాపహాడ్, కరడ్‌పల్లి, కన్‌కల్, తాడ్వాయి గ్రామ శివార్లలో గల వాగులు పొంగిపొర్లాయి. బ్రాహ్మణపల్లి, కాళోజీవాడి శివారులోని వాగులపై బ్రిడ్జీల నిర్మాణం పూర్తికాకపోవడంతో తాత్కాలికంగా వేసిన మొరం రోడ్లు దెబ్బతిన్నాయి. సుమారు గంటన్నర పాటు వర్షం కురియడంతో ఏపుగా పెరిగిన మొక్కజొన్న, పత్తి, సోయా పంటలు దెబ్బతినే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడ్వాయి -చిట్యాల మార్గంలో ఉధృతంగా పారుతున్న వాగు

క్లుప్తంగా

చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి



డిచ్‌పల్లి: తమకెవరూ లేరనే భావనను మనసులోకి రానీయకుండా, గురువులు చెప్పే పాఠాలను సరిగా వింటూ చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిజామాబాద్ చైర్‌పర్సన్ సంపూర్ణ సూచించారు. కమిటీ మెంబర్లు శోభ, రాజేంద్రప్రసాద్‌తో కలిసి డిచ్‌పల్లిలోని మానవతాసదన్ ను గురువారం సందర్శించారు. పిల్లలతో ప్రత్యేకంగా సమావేశమై విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఆడపిల్లలకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. హైదరాబాద్‌లో చదువుతున్న సదన్ పిల్లల వివరాలను కేర్‌టేకర్ రమేశ్ ద్వారా తెలుసుకున్నారు. తమవంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడు అందజేస్తామని చైర్‌పర్సన్ అన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన



నిజామాబాద్‌నాగారం: అంతర్‌రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా గురువారం క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎడ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో 28 పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జిల్లా బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ గురువారం ప్రారంభించారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఆర్మూర్‌లో 42వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు శ్యామేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు రీజినల్ మేనేజర్ నిజామాబాద్: 9959226011, డిపో మేనేజర్ ఆర్మూర్: 9959226019, డిపో మేనేజర్ బోధన్: 9959226001, డిపో మేనేజర్ నిజామాబాద్–1: 9959226016, డిపో మేనేజర్ నిజామాబాద్–2: 9959226017, డిపో మేనేజర్ కామారెడ్డి: 9959226018, డిపో మేనేజర్ బాన్సువాడ: 9959226020 ఈ నంబర్లకు ఫోన్‌చేసి తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

వెళ్లి రావయ్య బొజ్జ గణపయ్యా..



నగరంలో రథం వద్ద సీపీ సత్యనారాయణ, సార్వజనిక్ గణేశ్ మండలి సభ్యులు

- ఘనంగా గణేశ్ నిమజ్జనం
- పోలీసుల పటిష్ట బందోబస్తు

జిల్లాలో గణేశ్ నిమజ్జన వేడుకలు గురువారం ఘనంగా సాగాయి. నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ చెంతకు చేరాడు. గణేశ్ ప్రతిమలను మండపాల నిర్వాహకులు పలు వాహనాల్లో ఊరేగింపు చేపట్టి స్థానిక చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు. గణపతి బొప్ప మోరియా.. బోలో గణేశ్ మహరాజ్ కీ జై అంటూ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్నారు. సీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారుల పటిష్ట బందోబస్తు మధ్య నిమజ్జన వేడుకలు కొనసాగాయి.

– సాక్షి నెట్‌వర్క్



బాసరలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



బైక్‌పై గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



డ్రోన్‌తో వేడుకలను పరిశీలిస్తున్న పోలీసులు



గణపతి బావిలో నిమజ్జనం చేస్తున్న దంపతులు



గణనాథులతో యువతులు



నిమజ్జనం చేస్తున్న బాలిక



పద్మనగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

మెరుగైన వైద్యానికి ప్రభుత్వం కృషి

- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- డిచ్‌పల్లిలో డయాలసిస్‌సెంటర్ ప్రారంభం

డిచ్‌పల్లి: గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రభుత్వ దవాఖానల్లోనే డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుదర్శనం, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డీసీహెచ్ శివశంకర్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ సుశాంత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శక్కరికొండ కృష్ణ, నడిపన్న, ఒడ్డెం నర్సయ్య, నీరడి పద్మారావు, అమీర్, సాయిలు, ఫార్మాసిస్ట్ రాధాకిషన్, హెడ్‌నర్స్ రత్నకుమారి, సిబ్బంది సురేందర్‌రెడ్డి, గోపీ, ప్రకాశ్ పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బ్యాంక్ కాలనీని అభివృద్ధి చేస్తా

- కాలనీలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మిస్తా
- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని మహాలక్ష్మినగర్ బ్యాంక్‌కాలనీని మరింత అభివృద్ధి చేసి తన ఇష్టదైవమైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తానని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం బ్యాంక్‌కాలనీ కమ్యూనిటీ భవనం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. కాలనీలో ఇప్పటికే రూ.20కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ఎమ్మెల్సీ కవిత సహకారంతో ఐకేపీ, అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు తెస్తానన్నారు. కార్యక్రమంలో బాజిరెడ్డి సతీమణి వినోద, ధర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, బ్యాంక్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెనిగళ్ల సురేశ్, కార్యదర్శి రాజకుమార్, రమేశ్ కులకర్ణి, శ్రీనివాస్, రాజాగౌడ్, గణేశ్ ప్రసాద్ శర్మ, దత్తు రావు, వెంకట్, అభిలాశ్, ఉమాకృష్ణ, మహిళా మండలి అధ్యక్షురాలు శిల్ప, భాఫా, నారాయణ, భాస్కర్, గంగామణి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్ డాడీ.. నా గణపతి నాకిచ్చేయ్

- నిమజ్జనం చేయొద్దంటూ కన్నీరుపెట్టిన చిన్నారి
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

నందిపేట్(ఆర్మూర్): ప్లీజ్ డాడీ నా గణపతి నాకిచ్చేయ్ అంటూ ఓ చిన్నారి కన్నీరు పెడుతూ తాను వినాయక ఉత్సవాల్లో పూజించిన గణేశుడిని నిమజ్జనానికి తరలించేది లేదంటూ తన తండ్రితో మారం చేసింది. నందిపేట మండలం ఉమ్మెడ గ్రామానికి చెందిన మహేశ్, సంగీతల కుమార్తె ఇప్సిత ఉత్సవాల్లో భాగంగా గణేశునికి నిత్యం పూజలు చేసింది. గురువారం నిమజ్జనానికి గణేశ్ ప్రతిమను తీసుకెళ్తుండగా ప్లీజ్ డాడీ తీసుకెళ్లొద్దంటూ తండ్రి చేతిలో ఉన్న ప్రతిమను తీసుకొని పరుగు పెట్టింది. చివరికి తల్లీదండ్రులు సముదాయించడంతో స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. చిన్నారి మారం చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.



తన గణపతిని ఇవ్వాలంటు కన్నీరు పెడుతున్న అప్సిత

బాధితులకు వరం సీఎంఆర్‌ఎఫ్

అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో 29 మంది బాధితులకు మంజూరైన రూ. రూ. 13,32,900 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం పాటుపడే మహోన్నత వ్యక్తి అని అన్నారు. బాధితులు క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే చెక్కుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, సిర్ప రాజు, ధర్మపురి, రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

- రేబిస్ వ్యాధి ప్రాణాంతకం
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి

డొంకేశ్వర్(ఆర్మూర్): పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి అన్నారు. నగరంలోని పశువైద్యశాలలో ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రేబీస్ వ్యాధి ప్రాణాంతకమని, ఇది కుక్కకాటు, గబ్బిలాల వల్ల సోకుతుందన్నారు. ఎవరైనా కుక్కకాటుకు గురైతే వెంటనే కరిచిన చోట సబ్బునీళ్లతో శుభ్రం చేసి 24 గంటల్లోగా టీకా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బాలిక్ అహ్మద్, భరత్, కైసర్, ప్రమోద్, పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కకు టీకా వేస్తున్న జేడీ జగన్నాథచారి

వినాయకుని లడ్డూ వేలం

గణేశ్ నవరాత్రుల్లో వినాయకుని చేతిలో పెట్టిన లడ్డూలను మండలి నిర్వాహకులు చివరి రోజు వేలం వేయగా పలువురు అత్యధిక ధరలకు దక్కించుకున్నారు. లడ్డూలు దక్కిన వారికి నిర్వాహకులు పూలమాలలతో సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



బోధన్‌లో లడ్డూతో మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి దంపతులు



చిత్రపురి సంస్థ సొంతం చేసుకున్న లడ్డూ



ఆర్యవైశ్య సంఘంలో లడ్డూతో దీకొండ బద్రినాథ్



ఈస్ట్ బ్యాంక్‌కాలనీలో లడ్డూతో దంపతులు

బందోబస్తును పరిశీలించిన సీపీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో నిర్వహించిన మిలాద్–ఉన్–నబీ పండుగ బందోబస్తును సీపీ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ పార్క్ చౌరస్తా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.



నెహ్రూపార్క్ వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ

క్రైం కార్నర్

చోరీకి ఉపయోగించిన కారు లభ్యం

ఇందల్వాయి: మెండోర మండలం పోచంపడ్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో బుధవారం రూ. 12 లక్షల భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. దొంగల కోసం పోలీసులు గాలిస్తుండగా వారు వాడిన కారును ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పక్కన నిర్వహించే పశువుల సంత వద్ద గురువారం గుర్తించి స్టేషన్‌కి తరలించారు. కారుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

బైకుల నుంచి పెట్రోల్ చోరీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పలు ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కొన్ని రోజుల నుంచి పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. బుధవారం రాత్రి సైతం కాలనీలోని ఓ ఇంట్లో బైక్‌లో ఉన్న పెట్రోల్ చోరీకి గురైంది. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

మహారాష్ట్రలో మాచారెడ్డివాసి..

మాచారెడ్డి: ఉపాధి నిమిత్తం మహారాష్ట్రకు వెళ్లిన ఓ యువకుడు అక్కడి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గంగుల చంద్రం (28) మూడు రోజుల క్రితం మహారాష్ట్రలోని చాకూర్‌జిల్లా సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడి పోలీసులు ఆధార్ కార్డు ఆధారంగా చంద్రంగా గుర్తించారు. చంద్రం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు.



చంద్రం(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

భిక్కనూరు: రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన రాజయ్య(49) సొంత పనులపై భిక్కనూర్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో రాజయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



రాజయ్య మృతదేహం

చికిత్స పొందుతూ వివాహిత..

పిట్లం(జుక్కల్): పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుశీల(30) తన అన్న బోర్లం గ్రామంలో ఈ నెల 25న నిర్వహించిన అన్నదానానికి వెళ్తానని భర్త దత్తుకు తెలుపగా వద్దు అనడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి అన్న మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ పూజారి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో పూజారిగా పని చేస్తున్న పండరినాథ్ మహరాజ్(83) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. 55 సంవత్సరాలుగా ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పండరినాథ్ మహరాజ్ (ఫైల్)

డెంగీతో ఇద్దరి మృతి



మధుప్రియ(ఫైల్)



తంగెలపల్లి లక్ష్మి(ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన తోపారం మధుప్రియ(24), తంగెలపల్లి లక్ష్మి(43) డెంగీతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన వీరు రెండు రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

బాల్కొండను వణికిస్తున్న డెంగీ..

డెంగీ జ్వరం మండల కేంద్రాన్ని వణికిస్తుంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 20 మంది మండల కేంద్ర వాసులు చికిత్సపొందుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలో సుమారు వంద మంది డెంగీతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.